వ్యంగ్యరచన:

అవతరించే తెలుగుతల్లి

శ్రీ కే. సభా

ఏదో ఆలోచించు కుంటున్న నావేపుకు తీవ్రముగా విసరికొట్టాడు పత్రికను మా వాడు. ఈ చర్యలో ఏదో విశేష ముంటుందని నాకు తెలుసు. పైగా ఏదో సరిపడని సంగతి పత్రిక నంతా అల్లుకుని వుంటుం దని గూడా నాకు అనుమానం లేకపోలేదు. థారుకమిటీ రిపోర్టు నందుకున్న అగ్రనాయకత్రయం భాషారాష్ట్ర సమస్యను ఏం చేసిందో, పైగా ఆ నివేదికను కాంగ్రెస్ కార్యవర్గం ఎలా అంగీకరిస్తుందో, అవతరించే ఆంధ్రరాష్ట్రం ఏ రూపంలో కనబడుతుందో తెలుసుకోవా లనే కాంక్ష ఆతురతతో హృదయం ముడివడుతోంది. అందుకే వెంటనే పత్రికను పరిశీలించాను. అటు గంజాం కోరాపుట్టి జిల్లాల ఊసెత్తక ఇటు మదరాసుకు నీళ్లువిడిచి తెలంగాణాను గంగలో కలపి ముక్తసరిగా ఏర్పడే ఆంధ్రరాష్ట్రచిత్రం స్పష్టంగానే కనబడుతూనే ఉంది. ఆ రోజంతా నాకూ మా వాడికీ ఈ చర్చతోనే దొర్లిపోయింది.

మా చర్చల్లో కాకతీయుల కదనపాండితినుండి తెలుగువెలుగుల బాలచంద్రుని పచ్చిరోసాల వరకు... తెలుగుటిల్లాండ్ర ముగ్గుల అల్లికలలోని సొబగులనుండి హంపీ శిల్పాల నైపుణ్యంవరకు... సుమతిశతక కారుని దూరదృష్టినుండి కవిత్రయాల కవితాశిల్పంవరకు—ఇంకా ఎన్నో తెలుగుతనం వివిధరంగాలలో మూర్తీభవించిన రీతులన్నీ గూడా వరుసక్రమంగా గాకున్నా చిందరవందరగా స్మృతికి వచ్చాయి.

అనవసర వాగ్వివాదాలతో ప్రయోజనంలేని చారిత్రక స్మృతులతో ఉదయించిన అలసటతో తొమ్మిదిగంటలకే బాగా నిద్రపట్టింది. కానీ ఈ నిద్ర అట్టే నిశ్చలంగా నిలువలేకపోయింది. పన్నెండుగంటలు కొట్టిన శబ్దం ఎక్కడో రామజోగివేసే కంచుజాలర మ్రోతలాగా మెల్లగా వినిపించాయి. అప్పటినుండే కలతనిద్రలో శరీరం తేలిపోతున్నట్టు గమనం...ఆ తేలిక వాతావరణంలో కనబడ్డ దృశ్యాలను చిత్రించడమే ఈ రచనలోని అసలు ఉద్దేశంకూడా.

సాధారణంగా పట్టణాల్లో కనిపించే నాటకశాలలకు ఆ స్వప్నసీమలో నేను చూచిన నాటకశాలకు ఎంతో తేడా వుంది. ఈ నాటకశాలలకంటే అది రమణీయంగా కనిపించినప్పటికీ అందులో ఏదో శిల్పం మరుగుపడ్డట్టు ఏదో అవ్యక్తమైన కళ దోబూచులాడుతూ అస్పష్టంగా కనబడుతున్నట్టూ తోచింది.

ఎక్కడా తెలుగుతనం గంతులేస్తూ వుంది. ప్రేక్షకుల్ని చూచినపుడు చప్పున ఎవరో.. ఏ ప్రాంతంవారో గుర్తించే అవకాశం లేకపోయినప్పటికీ కాస్తా ఆగి వారి భాషను గమనిస్తే అందరూ తెలుగువారే నని తెలుసుకొనే వీ లున్నది.

జరుగబోతున్న నాటకమేదో అందులో పాత్రధారు లెవరో కనిపెట్టడం చాలా కష్టమనిపించింది. అంతవరకూ ఆ విషయాన్ని గురించిన ఏ ఆచూకీగూడా అందకపోవడంవల్లా ఎంతో తికమక పడవలసిన గతి పట్టింది.

మొదటి దృశ్యం అతిమనోహరంగా ఆహ్లాదజనకంగా రచించబడింది. అందులో ఎవరో కొందరు ప్రత్యేకవ్యక్తులు ఆ పరిసరాలనంతా అత్యంతాసక్తితో కడుజాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. కనబడ్డవారినల్లా పలకరిస్తున్నారు. అందులో కొందరివద్దనుండి అందిన జవాబులను రికార్డుచేసుకుంటున్నారు. ఇది కథో...దీని పర్యవసాన మేమౌతుందో ఇందులో దాగున్న నాటకనైపుణి ఏమిటో తెలుసుకోడానికి మెదడు కరగిపోయేలా ఆలోచించాను.

ఈ ఆలోచనలు పెల్లుబుకుతున్నపుడే తెర జారిపోయింది. యవనిక వ్రాలడంతోటే ప్రేక్షకులనుండి పెద్దకలకలం పుట్టింది. ఈ కలకలాన్ని అణచడానికో...మరి యింకే అవసరంవల్లానో నేను చెప్పలేను కానీ, వేదికమీద ముసుగును తొలగించుకొని యిద్దరు ముందుకొచ్చారు. వారిని నాయకులని గుర్తుపట్టాక నాకు సహితం ఏదో క్రొత్త అనుభవాన్ని చవిచూస్తున్నట్టు.. ఏదో క్రొత్త ప్రపంచంలోకి పయనిస్తున్నట్టు ఆనందం కలిగింది. వారి శాంతవచనాలు వినడంతోటే నాటకశాలలో నిశ్శబ్దం నిర్విఘ్నంగా తాండవించింది. కానీ అక్కడక్కడా గుబలు గుసలు మాత్రం అస్పష్టంగా చిరబుస్సులు కొడుతున్నాయి.

తెరతొలగడంతోటే రెండో రంగం ప్రారంభమైం దనుకున్నాను. కానీ అందులో వెలుతురే కనిపించలేదు. సన్నగా పలుచని చీకటి తెరల్లో ఎవరో కొందరు రహస్యాలోచనలు చేస్తున్నట్టు ఊహించడంలో అసహజం కనిపించలేదు. అతి ప్రయత్నంమీద అక్కడున్నది ముగ్గురు మాత్రమేనని గుర్తుపట్టగలిగాను. ఆ ముగ్గురూ దేనిని గురించి చర్చిస్తున్నది ఏం చేస్తున్నదీగూడా సరిగా కనిపించకపోవడంతో అసలు యిది నాటకమేనా అనిపించింది. కాని ఆ నాటకానికి నే నొక చిల్లిగవ్వకూడా యిచ్చినట్టు గమనంలేదు కాబట్టి, అసలందులో టిక్కట్ల విధానంగూడా ఉన్నట్టు తోచడంలేదు కాబట్టి అక్కడ ప్రేక్షకుల అధికారాలు, ఆటలు, ఆర్భాటాలు ఎంతమాత్రం సాగవని కిక్కురుమనకుండా కూచున్నాను.

అదృష్టం అవసరమైనపుడు ఎవరికీ అందదు. కొందరు అదృష్టమంటూ ఏదీ లేదంటూ లభించే అదృష్టాలతోనే అదృష్టాలకు కారణాలు వెదుకుతూ వుంటారు. నా కిక్కడమాత్రం లభించిన పరిస్థితిని అదృష్టమనే చెప్పాలి. ఎందుకంటే అమాంతంగా ఏ ప్రయత్నమూ లేకుండా నే నిలాంటి నాటకాన్ని తిలకించడం అదృష్టంగాక మ రేమౌతుంది. ఆ కనిపించిన దృశ్యం...అది అట్టే సాగుతుండడం నాకు కొంచెంచీకాకు గల్గించిన మాట వాస్తవమే. కానీ ఆ పరిస్థితి వెంటనే మారిపోయింది. దృశ్యమంతా పసిడికాంతులతో ముంచివేయబడింది. అప్పుడే అక్కడున్న వ్యక్తులు బాగా కనిపించారు. అందులో ఒకరిముఖంమాత్రం కొంచెం అస్పష్టంగా కనిపించింది. కొద్దిగా ఆగి సావధానంగా పరిశీలించాను. దృశ్యమంతా ఒకబొమ్మలకొలువులాగా కనిపించింది. అందులో పూర్తియైన శిల్పాలు కొన్ని...సగం పూర్తియైనవి కొన్ని, అప్పుడప్పుడే ఆకారాలను దిద్దుకొంటున్నవి కొన్ని...రంగు లివ్వబడుతున్నవి కొన్ని...మెరుగులు వేయబడుతున్నవి కొన్ని—రకరకాలుగా వివిధభంగిమలతో చూట్టానికి ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నిగూడా కల్గిస్తున్నాయి.

ఈ బొమ్మలు చేయబడుతున్నందుకు గల కారణాలనుగూడా నేను ఆలోచించడానికి మొదలెట్టాను. కానీ ఈ ఆలోచనకు నా కవకాశం లేకపోయింది. జారిపోయిన యవనికమీద్ది బొద్ధచిత్రంవేపు నా దృష్టి ప్రసరించింది.

ఆ ఆకుపచ్చని బంగారు అంచుల తెరమీద నాగార్జునుని శిల్పసౌందర్యలహరిలోని ఒక బిందుప్రమాణంగల శిల్పం మాత్రమే చిత్రించబడింది. ఆ చిత్రంలో ఎన్నో జీవకళికలు మూర్తీభవించి ఏదో అనిర్వచనీయమైన కరుణారసోద్దీపనలో ప్రకృతిని ముంచెత్తడానికి సిద్ధమౌతున్నట్టు తోస్తున్నది...ఈ విచిత్ర చిత్రరచనలలోని కౌశల్యాన్ని...ఆ చిత్రంలోని శిల్పనాచార్యుని భావనా తరంగాల కదలికల గరిమల లాలిత్యాన్ని, ఔన్నత్యాన్ని తిలకించడం వల్లనే కావాలి, ప్రేక్షకులు ఎవరూ అల్లరి చేయడంలేదు...అందరి ముఖసీమల్లోకూడా భవిష్యత్తులో జరుగబోయే...ముందు దృశ్యంలో గోచరించబోయే సంఘటనను చూడాలనే తీవ్రమైన కాంక్ష తీరని దాహంలా ద్యోతకమౌతూ వుంది.

మూడవరంగం ఏమంత ఆకర్షణీయంగా ఉండదనే సందేహం కలిగింది. ఈ సందేహం ఎందుకు గల్గిందో నా కిప్పటికీ అర్థం కావడం లేదు. కానీ అనుకున్న దానికంటే.. గొర్రిపోయిన దృశ్యాలకంటే అది చాలా ఆకర్షణీయంగా వుండడం నా కాశ్చర్యం వేసింది. దీనికి ప్రత్యేకమైన కారణం లేకపోలేదు... ఈ దృశ్యంలో కనిపించిన పాత్రలు అధికం.. ... యింతవరకూ కనబడినవా రంతా యిందులో కనిపించారు......వారుగూడా ఒక సమావేశాన్ని నడుపుతున్నట్టు గ్రహించడానికి అట్టే కాలం పట్టలేదు...

ఆ సమావేశభవనం ముందు ఎందరో పత్రికావిలేఖరులు గుంపులు చేరివున్నారు...ఇదేనేమో నాటకానికి జీవంపోసే ప్రధానఘట్టమని నా హృదయంలో ఒక మెలకువ ఉదయించింది. వలయాకారంగా కూచున్నవారి మధ్యలోనే ఈ బొమ్మలన్నీగూడా వరుసక్రమంలో ఉంచబడివున్నాయి. చుట్టూనున్న వ్యక్తులను తప్పించుకుని నా చూపులు మెల్లగా ఆ బొమ్మలమీదికే వాలాయి. వాటిని చూచిందే నాకు చాలా ఆశ్చర్యంవేసింది. ఈమారు వాటిలో చాలాభాగం నిండు ఆకారంతో నూత్నకళలను విరజిమ్ముతున్నాయి. ఒక్కటి రెండుమాత్రం కొద్దిగా అసంపూర్తిగా కనబడుతున్నై. ఇంకొకబొమ్మ కొంచెం పెద్దదిగా కనిపించినా సరిగా రూపొందించబడలేదు. ఆ బొమ్మ ఎవరిదో ఆ శిల్పం ఎవరి సొత్తో చూడాలని కనిపెట్టాలని నేను శతవిధాలా ప్రయత్నించాను. కానీ ఆ శిల్పాన్ని కనబడనివ్వక ఆ వ్యక్తుల్లో ఒకాయన అడ్డంగా కూచున్నాడు. నాకు ఆశాభంగం కలగడంతో ఆగక పట్టుదల ద్విగుణీకృతమేగాదు. వేయింతలు పెరిగిపోయింది. వెంటనే ఉన్న స్థానాన్ని మెల్లగా ఒదిలెట్టి చడీ చప్పుడూ లేకుండా కొంచెం దక్షిణంవేపు వెళ్లి కూచున్నాను. నేను వెళ్లింది తెలుసుకోనో, లేక నా ప్రయత్నాన్ని విఫలం చేయడానికో అదే వ్యక్తి పైకి లేచి కాస్త అటూయిటూ కదలి ఆ చోటును వదలి నా కడ్డంగా కూచున్నాడు.

ఈ మారు కలిగిన విసుగుతో నా గుండెల్లో వింధ్యాచలమంతటి విప్లవం ఉడికి బ్రద్దలై ప్రపంచాన్ని యిముడ్చుకుంటుందని నేనే భయపడ్డాను. కానీ వాస్తవాన్ని గ్రహించి ఎంత పిచ్చోణ్ణి అనుకుని మళ్లీ యథాస్థానానికి మళ్లాను...

ఈ మళ్లడంతోనే యవనిక జారిన చప్పుడు వినిపించింది. ఈమారు తెరపై ఏ శిల్ప చిత్రం నాట్యం చేస్తుందోనని గంపెడంత మాత్రమే గాదు, కొండంత. అదిన్నీ హిమాలయాలంత ఆశతో కూచోకముందే తెరవేపు చూశాను.. కానీ కారుమేఘాలకంటే నలుపుగా ఏనుగు రంగుకంటె దట్టంగా ముద్దకట్టిక చీకటి కంటే ముతకగా నల్లటితెఱ కనిపించింది. బొరుమంటూ ఏడుద్దామని ఎలుగు సవరించుకున్నాను...కానీ ఏ ఎఱ్ఱబుట్టో పసిబట్టి న్యూసెన్సు కేసు పెడితే కానీ గూడా ఖర్చుపెట్టకనే ఇంత మహోజ్వల నాటకాన్ని ధారాళంగా చూస్తున్న నేను అపరాధం వేసిన డబ్బుల్ని ఎలాగా చెల్లించుకోగలననే ఆలోచన తట్టింది. అంత వివేకం ఉదయించడం కారణంగానే ఆ నల్లటి తెరవేపు నిశ్చలంగా చూస్తూ నిలుచుకోడానికి వీలుగాక కూచోడం మరచిపోయి కుములుతూ వుండిపోయాను.

హాలంతా ఒక చీకటి కూపంలా కనబడుతున్న తరుణంలో ఆ కరుడుగట్టిన చీకటిని చీల్చుకుంటూ ఏదో గానం పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది...క్షణంలోనే ఆ గొంతు త్యాగరాజ భాగవతార్‌గారి దని గుర్తుపట్టినందుకు నాకు బ్రహ్మానంద మైపోయింది. కొంపదీసి యిక్కడేదీ పొరబాటుగా అర్థం కాదనుకుంటాను. త్యాగరాజంటే రామాయణం గానం చేసిన త్యాగయ్యకాదు సుమా...అరవచిత్రాల్లో కదంతొక్కే భాగవతారని తెలుసుకునే శక్తి తెలుగువారికి వుంటుం దనడంలో సందేహం లేదు. ఎందుకంటే త్యాగయ్యకంటే ఎక్కువగా విశేషంగా, విశదంగా, త్యాగరాజభాగవతార్‌ను గురించే మన తెలుగువారికి బాగా తెలుసు.

పగబట్టిన వడగండ్లవానలా... పందిరిపై కదంత్రొక్కుతూ పిట్టల్ని బెదరించడానికి ప్రయత్నిస్తున్న రైతుపడుచు ఒడిసెల దెబ్బల్లా ఆయనగారి గానంతో నా తల దిమ్మెక్కిపోతున్నది. ఇందుకు పరిహారమేమిటా అని ఆలోచించే ఓపికగూడా నాకు లేకపోవడం ఆశ్చర్యం గాదు.

నల్లటి తెఱమీద ఎఱ్ఱని కాంతిచ్ఛాయలు పడడంతో ఏదో క్రొత్త కనబడుతుం దనుకున్నాను. 'వంగాయం సాంబార్.. అళాకు రెండణా' "పట్టణంప్పొడి క్కెటు వాంగు" తెలిసీ తెలియని అరవ అక్షరాల సాయంతో ఆ ప్రకటనలు తెలుసుకోడం మరీ అవస్థైకూచుంది.

ఏదో గండశిలలు మెదడులో కూరుకపోయినట్టు తలనొప్పి ఘనీభవించింది. "వంగాయం సాంబార్: వంగాయం సాంబార్...అళాకు రెండణా" చెవులు గింగురుమంటున్నాయి... జోరీగలాగా చెవిలోనే ఊదరెడుతున్నాడు కుర్రాడు. టీ కాఫీలస్థానే ఈ సాంబార్ ఎప్పుడు అవతార మెత్తిందో విస్తుపోయాను. నాలుగళాకుల సాంబారు త్రాగి రెండుపలాల పొడుమును పీలిస్తే ఈ తలనొప్పి పోతుందనే ఆలోచన తట్టకపోలేదు. సాంబారు ఘుమఘుమలతో నాలుక చెమ్మగిల్లడమే కాదు, చలానికంటే వేగంగా నాలుకనుండి నీరు వెల్లువలు గడుతోంది. కానీ జేబీలో పైసా లేదు. నా దురదృష్టాని కెంతో బాధపడ్డాను. జుర్రు జుర్రు మంటున్న శబ్దాలు హాలంతా సుడివడుతున్నాయి. ఏవో రకరకాల శబ్దాలు ...గాలిలో కలసిపోతున్నాయి. అవి త్రేన్పులో మరి యేవో ఊహించడంగూడా కష్టమైపోయింది.

ఆ మహాప్రమాదంనుండి నన్ను దరి జేర్చే శుభక్షణంకోసం ఆకాశంకేసి చూశామన్నా ఆ అనుకూలంగూడా అక్కడ లేకపోవడంతో ఖిన్నుడైపోయాను. తెరవెనుక గానంమాత్రం తుఫానుపరిణతికి వచ్చింది.

అదృష్టం గొడ్డ దనే చెప్పాలి. అంతలోనే తెఱ తొలగిపోయింది. మొదట ఏమీ కనిపించలేదు. ఎవరో ఓమూలనుండి టార్చిఫోకస్ చేశారు. ఆ వెలుగుల వలయంలో ఒక శిలావిగ్రహం కనిపించింది.

ఆ విగ్రహాన్ని చూట్టానికే నాకు బుద్ధిపుట్టలేదు. అదొక స్త్రీ మూర్తివిగ్రహం. ఎందుకలా తయారయిందో అగమ్యగోచరంగా వుంది. ఆ విగ్రహం ఎలా కనబడిందీ చెప్పడంగూడా నాకు చాలా కష్టంగానే తోస్తున్నది. ఎందుకంటే సౌందర్యంలోని తొలకరింపులను సింగారాల్లోని చిలకరింపులను చిత్రించడం చాలా సులభమే. కానీ వికృతంలోని వంకరలను, అసంపూర్ణతలోని సంకుచితాలను సృష్టించడం చిత్రించడంగూడా చాలా కష్టమే...

ఆమెకు జుత్తే లేదు. ఇక్కడ ఆమె అంటే ఆ శిల్ప మని గ్రహించడం చాలా అవసరం. ఆ శిల్పం స్త్రీమూర్తి......ఆ స్త్రీమూర్తికి జీవం పోశారు చలన ముంది. అందుకనే ఆమె అంటున్నా. జుత్తులేని ఆమె తల చాలా వికృతంగా వుంది...శుభ్రమైన బోడిగుండైనా బావుండేది కానీ అక్కడక్కడా కురులు కుచ్చు కట్టుకున్నాయి.. ఆమెకు కళ్లున్నాయి కానీ, ఒకటిమాత్రం కొంచెం చిన్నదిగా కనబడుతుంది, బహుశా అది కనిపించ దనే నా అభిప్రాయం. ఎందుకంటే చూపంతా ఎడమ ప్రక్కే వాలిపోయింది. కనబడుతున్నది ఒక్క చెవ్వు మాత్రమే.. ఇంకో చెవ్వు ఉన్నదో లేదో గుర్తించడం చాలా కష్టమై ఊరుకోవలసి వచ్చింది.

తలలో వుండవలసిన మిగిలిన అవయవాలు వుండవలసినంత పటుత్వంతో ఉండకపోయినా సుమారు పాటిగా వుం దని ఒప్పుకోడం సబబనే చెప్పాలి.

ఇక కుడిహస్తం ఖచ్చితంగా త్రుంచివేయబడింది. అంచేత ఆ చేతిని గురించిన ప్రసక్తి ఎంతమాత్రమూ అవసరం లేకపోయింది. ఎడమచేయి మోచేతినుండి స్పష్టంగా అందాలు

(22 వ పేజీ చూడుడు)

లేఖలు

పేదలకు వృత్తులు

అయ్యా,

స్వరాజ్యములో మా పేదల బ్రతుకింతేనా? ప్రభుత్వము మాగురించియేదైనా ఆలోచిస్తుందా?

ఏ స్కీము పెట్టినా మా పేదలగురించే యంటారు. పేరు మాత్రము పేదలది. ఫలితము పెద్దవారిదే. పేదలంటే, నిర్దోషులు, అమాయకులని మీ యందఱుకు తెలుసును. అనాథులమని గదా మమ్మావలకు గెంటేస్తున్నారు. గట్టిగా అడిగితే మెరిట్ అంటున్నారు. ఈ పాడు మెరిట్టే మా పేదల కొంప తీస్తోంది.

ఎంప్లాయిమెంటు ఆఫీసులు ఎందుకున్నాయో అర్థము కాదు. ఏదో వొలికి పోతుందని ఎగబడి వెళ్లితే, ఎన్నో వాయిదాలు వేసి త్రిప్పి ఆఖరకు, అది లేదు, యిది లేదు పో పొమ్మంటున్నారు. పేదలకు యేదైన తక్కువ వుండవచ్చును. అన్నీ వుంటే అందఱులాగునే టింగురంగా యని మేము తిరుగుదుము. రెండేండ్లు అయింది. నన్ను గురించి మాత్రము యేమి చెసేరు?

నేను కాంగ్రెసులో పని జేసి దెబ్బలు తిన్నాను. ఎ. ఆర్. పి. లో వార్డెనుగా పని జేశాను. మిలిటరీలో క్లర్కు కోర్సు ప్యాసయి, బర్మా యుద్ధభూములలో క్లర్కు హవిల్దారుగా పని చేశాను. ఆఫీసుపనిలో ఆరితేరిన వాడిని. నిమ్న జాతికి చెందిన యువకుడను. ఏ పని యిచ్చినా ఓపికతో చేయడానికి సమర్థుడను.

ఈ పయి కేటగరులున్న వారికే గాని యితరులకు పనిగాని, భూమిగాని యివ్వమంటారు. నాకు మాత్రము ఒక ఆక్టింగైనా యివ్వరు. స్వరాజ్యములో నేను పనికిరానని నన్ను పైకి త్రోసి వేసేరు. ఏవిగాని క్రొత్తవారు నా జూనియరులందఱుకు పనులిస్తున్నారు. నా బోటి అమాయకులు పేదవారెందఱో పనిలేక పరితపిస్తున్నారు. మా గోడు వినేవారెవరు? అడిగేవారెవరు? అధికార్ల యనుగ్రహము. అందులో స్వరాజ్యము.

పని యివ్వకపోతే మీ దయ, ఏదైనా భూమైన యిస్తే నేను, నా కుటుంబము, దున్నుక బ్రతుకుతామని తూ|| గో|| జిల్లా కలెక్టరు గారిని, ఎంప్లాయిమెంటు ఆఫీసరుగారిని ఏడాది నుండి ఎన్నో అర్జీలనిచ్చి ప్రార్థిస్తూ వున్నాను. ఆ భూమియైనా యిష్టులు పరిచయస్తులకేగాని యితరులకే కివ్వడము లేదు.

మెడ్రాసు పబ్లికు సర్వీసు కమీషనువారు కోపరేటివ్ జూనియరు యినస్పెక్టరు పనికి, క్లర్కు పనికిని, యింటర్ వ్యూయిచ్చారు. కాకినాడ రీసెటిలుమెంటు ఆఫీసరుగారు కూడా నేను నా పనులకు తగినవాడనని సిఫార్సు చేసెరు; అప్పాయింటుమెంటు రూల్సు ప్రకారము నేను పూర్తిగా అర్హుడనై యున్నాను. నా పొరపాటేమిటో కాని సెలక్షనులో నన్ను నిరాకరించేరు. కారణము చెప్పరు. తిరిగి నా విషయ మాలోచించమంటే, ఆక్షేపణమోయని ఆ పట్టుమీదే యున్నారు.

ఈ అన్యాయముచేత నా జీవితము పాడై పోతుంది. రక్షించండని ఎంప్లాయిమెంటు అండు రీసెటిల్‌మెంటు పై అధికార్లకు, మెడ్రాసుగవర్నమెంటు, సెంట్రల్ గవర్నమెంటుకు, ప్రధాన మంత్రి పండిట్జు జవ్హారులాల్ నెహ్రూగారికిని, లెక్కలేనని, పిటీషను లిచ్చి మొరపెట్టుకుంటున్నాను. ఏదా దైనది. ఎవరూ మాటాడరు.

16-3-1949 ని కాకినాడ క్యాంపులో, ఫుడ్ మినిష్టరు టి. యస్. యస్. రాజన్‌గారిని, మద్రాసు రీజినల్ డైరెక్టరుగారిని దర్శించేను. మినిష్టరుగారు నన్ను చూడగానే మాట్లాడకుండా పొమ్మన్నారు. డైరెక్టరుగారు మాత్రము సంగతి విని దగ్గరవున్న జిల్లా కలక్టరుగారిని, ఎంప్లాయిమెంటు ఆఫీసరుగారిని చూపించి, వీరి నాశ్రయించు; పని యిచ్చినా, భూమి యిచ్చినా, వీరి దయ. నేనేమీ చేయలేను. పోపొమ్మన్నారు. ఉంటేయేమి ప్రమాదమోయని, నా చేతిలోని పిటీషను బల్లమీద పెట్టి మెల్లగా బయటికి పోయేను. అయ్యో! నేడు పేదల బ్రతుకెంత అన్యాయమై పోయింది! ప్రభుత్వమే ప్రజలయందింత అనాదరణ పక్షపాతము చూపిస్తుంటే, అన్నమో రామచంద్రా యని హడలుచున్న పేదవారిలో శాంతి యెట్లు కలుగుతుంది? ఇప్పుడైనా ప్రభుత్వము నావంటి పేదలను కనికరించి వెంటనే రక్షించడానికి తగు శ్రద్ధ తీసుకుంటుందని ప్రార్థిస్తున్నాను. ప్రాణము పోయేక ప్రయత్నములు ఎన్ని చేసిన యేమి లాభము?

రెడ్డి అప్పలస్వామి.

నూలు పంపిణీ

అయ్యా,

శ్రీశ్రీశ్రీ మద్రాసు గవర్నమెంటువారు నూలును పంపకము చేయు విషయములో గ్రామ గ్రామ విచక్షణ లేకుండ అన్ని గ్రామములలోను మగ్గము నేయువార లందరికి నూలులు యిచ్చునట్లు ఏర్పచియుండిరి. అయితే ఆ విషయము ఈ అమాయక బీదలకు తెలియదను భావమున నూలు డీలర్లు పనివారల నోరు కొట్టి బ్రతుకుచున్నట్లు నాకు తోచుచున్నది. ఇంకొక విషయము గవర్నమెటువారు. పెట్టె (*One Bundle*)కు 0-8-0 కు తక్కువ లేకుండా లాభము వచ్చునట్లుగా యిచ్చుచుండిరి. డీలర్లకు ఆ లాభము చాలక బీదలకు యివ్వవలసిన నూలు మీద కూడా లాభము పొందవలెనని న్లాకున డీలర్లే నూలు అమ్ముకొన్నట్లు తెలియుచున్నది. డీలరుకు యిచ్చిన లాభము డీలరుది పనివాడి లాభము పనివాడిది గదా అయితే పనివాని లాభము డీలరులాభము డీలరే పొందుట యిప్పటి మన పరిస్థితులకు ఎంత శోచనీయమో యెల్లరకు తెలిసిన విషయమే. కొబట్టి యిందు మూలమున నూలు సప్లయి చేయు అధికారులకు మనవి చేయడమేమనగా—మగ్గమున్న ప్రతివానికి నూలు అందునట్లు చేసి దేశమును ఉద్ధరించ ప్రాధేయపడి మనవి చేయుచున్నాను.

చీ. శే. లాషి

జిల్లాబోర్డుల ఎన్నికలా? నామినేషనులా?

ఆర్యా,

మద్రాసు ప్రభుత్వంవారు యీ మధ్యన జిల్లాబోర్డులు, పంచాయతీబోర్డులు ఎలక్షనులు జరుపుతామని జులై మొదటి వారంలో జిల్లాబోర్డుల ఎన్నిక అధ్యక్షులు బోర్డులను స్వాధీనపరచుకుంటారని ప్రకటనలు జరిపినారు. ఇప్పటికే చాల సంవత్సరాల క్రితమే ఎన్నికలు జరిగినవి గనుకను అప్పటికి ఇప్పటికీ దేశంలో అనేకమార్పులు వచ్చినందుననూ ప్రజాస్వామికసిద్ధాంతాన్ని అనుసరించికూడా ఎన్నికలు జరగటం ప్రశస్తమైనదే. ఇందుకు మద్రాసు ప్రభుత్వాన్ని, స్థానికస్వపరిపాలనా శాఖామంత్రి శ్రీ. గౌ|| కల్లూరి చంద్రమౌళి గారిని అభినందించక తప్పదు. కాని ప్రస్తుత స్థితిలో ఎలక్షన్‌లు జరుపుట ప్రజాశ్రేయస్సు దృష్ట్యా యెంతవరకుసాధ్యమా అనీ, ఇందువల్ల యెంత వుపయోగం వున్నదా అనీ సంశయం చాలా మందికి కలుగుచున్నది. ఎందువల్ల నంటే—ఇదివరకు ఒక పర్యాయం జిల్లా బోర్డుల ఎన్నికలు జరుపుతామనటం, జిల్లా కాంగ్రెస్ సంఘాలు అభ్యర్థులను నియమించుటకు దరఖాస్తులతో నూరు, యేనబై, అరవై రూపాయలు ఫీజులు రకరకాలుగా తీసుకొనటం ఇందులో అనేకతగాదాలు (పార్టీలవల్ల) రావటం, ఇవి ఆల్ ఇండియా కాంగ్రెస్ దాకా పోవటం, వీటిని పరిష్కరించటానికి శ్రీమతి కమలాదేవి ఛటో పాధ్యాయగారిని నియమించటం, ఆమెకు యీ తగాదాలు తలనొప్పి కలిగించి తమ అధికారమును వదలుకొనటం, తదుపరి ప్రభుత్వము వారే ఎన్నికలు ఆపినామని ప్రకటించటం అందరికీ తెలిసినదే. ఆ సందర్భంలో దరఖాస్తుతో చెల్లించిన ఫీజులను ఇస్తామని రాష్ట్రకాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగారు కొన్ని ప్రకటనలు చెయ్యటం, కొందరికి ఇప్పటికి ఇవ్వకపోవటం జరిగినది. తిరిగి యీ ఎలక్షన్‌లో అభ్యర్థుల నియామకానికి జిల్లా కాంగ్రెస్ సంఘాలు రాష్ట్ర కాంగ్రెస్‌ను అనుమతి కోరుతున్నవి. అంగీకారమును పొందిన వెంటనే తిరిగి దరఖాస్తులు ఫీజులతోసహా కోరుతారు. లోగడ ఫీజును వాపసు పొందినవారు మా దరఖాస్తులు అలాగే వున్నవంటారు. కాగా ప్రస్తుతస్థితిలో కాంగ్రెస్ సంఘాలకు మంత్రివర్గానికి అనుకూల దాంపత్యం లేదని నాయకులే ప్రకటనలు చేస్తున్నారు గదా, మొన్ననే అస్సెంబ్లీ కాంగ్రెస్ పార్టీ నాయకుని ఎన్నికలో శ్రీ ఆచార్య రంగా గారు ప్రత్యేకంగా ఢిల్లీనుంచి వచ్చి చేసిన కృషి, ఇచ్చిన స్టేటుమెంటులు చూస్తే మంత్రివర్గానికి రాష్ట్ర కాంగ్రెస్‌కు అనుకూలదాంపత్యం కుదరలేదని తెలిసిన విషయమే గదా; యీ స్థితిలో జరుగనున్న ఎన్నికలు ప్రజాశాంతిని ప్రజాక్షేమాన్ని కాపాడగలవా? కాక ప్రస్తుత స్థితిలో ప్రజాస్వామిక సిద్ధాంతాన్ని అనుసరించి వయోజనుల ఓటుతో జరపటం లేదు గదా. 1951 సం|| లో వయోజన ఓటుతో అన్ని ఎన్నికలు జరుగనున్నవి గదా, యీ మధ్యలో కొద్ది ఓటర్సుతో యీ ఎన్నికలు జరుపుట అసంపూర్తిగాను అసంతృప్తిగాను వుండును గదా. అందువల్లను ప్రస్తుతవర్తమానకాలపరిస్థితులను బట్టి దేశక్షేమదృష్ట్యా ప్రభుత్వమే జిల్లాబోర్డులసభ్యులను నామినేట్ చేయుట చాలా ఉత్తమోత్తమముగానే కనుపడుచున్నది. ఇందుకు పరిపాలనా సమర్థత కలిగి నిరంతరం ప్రజాసేవయే తమ జీవితపరమావధిగా నిర్ణయించుకొని నైతిక జీవితం గలవారిని రాజకీయకక్షులతో నిమిత్తం లేకుండా జాతిమతకులవర్గభేదాలను పాటించకుండా ప్రభుత్వము నియమించటం చాలా ఉత్తమంగా కనుపడుచున్నది. ఇందువల్ల ప్రజలలో యెక్కువగా ప్రభుత్వ విధానమును ప్రచారము చేయుటకు, ప్రజలలో శాంతిని కలిగించుటకు, తద్వారా 1951 సం|| లో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్‌పక్షానికి అఖండవిజయాన్ని చేకూర్చుటానికి, ప్రస్తుతం ప్రభుత్వ యంత్రం నిరాఘాటంగా సాగిపోవటానికీ యెంతో అవకాశం కలుగుతుంది. కనుక యీ విషయాన్ని ప్రజాసేవకులు తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని ప్రభుత్వం యీ విషయాన్ని పునర్విమర్శన చేయాలనీ కోరుచున్నాను.

కాండూరి సీతారామయ్య.

అవతరించే తెలుగుతల్లి

(6 పేజీ తరువాయి)

చిందుతూ శృంగారాన్ని తొణికించుతోంది. ఆ చేతివ్రేళ్ల సోయగాలు. అంగులో అమర్చబడ్డ అంగుళీకాల వెలుగులు......ఆ పరిసరాలనే కాంతుల్లో ముంచివేస్తున్నవి.

ఇహ ఆమె మెడలో మంగళసూత్రం తప్ప కనిపించేదేమీ లేదు. కరుడుగట్టి పట్టుకున్న చిలుముతో బాధపడుతున్న కాసులపేరుమాత్రం అస్పష్టంగా కనబడుతూ వుంది.

అట్టే చూస్తూ పాదాల వద్దకు చూపులు వెళ్లేలోగా నా గుండెలు పగిలిపోయాయి. అసలు పాదాలే కనిపించలేదు. బహుశా భూమిలో దిగజారిపోయిందేమోననే అనుమానంతో క్రిందికి తొంగి చూచాను.. ఖచ్చితంగా తెగనరుక బడ్డట్టు కనబడ్డంవల్ల యిక లాభం లేదనుకున్నా.

ఆవిగ్రహం కదులుతుందేమో ననుకున్నాను .. ప్రక్కకుచూచాను.. పట్టాభిగారే... ఆశ్చర్యముతో కళవళపడ్డారు. ఒళ్లంతా చెమట పట్టింది. ఈ చెమట ఆ శిల్పాన్ని చెక్కిన ఆయనకైనా కావచ్చు.. చూచిన నాకైనా కావచ్చు. యిందులో ఆశ్చర్యం లేదు...ఎంతప్రయత్నించినా ఇదే నన్నట్టు చూస్తున్నారు. కుంచె చేతిలోనే వుంది బట్టలు రంగుల మరకలతో నిండిపోయింది. రంగు లందిస్తున్న రంగాజీ గూడా అట్టే శిల్పంకేసి చూస్తుండడం నాకు మరీ ఆశ్చర్యం వేసింది...

ఆమూలనుండి టార్చిని ఫోకస్ చేస్తున్న దెవరో. ఆ వెలుగుల్ని ప్రసరిస్తున్న దెవరో తెలుసుకోవడానికి తంటాలుపడ్డాను...వెలుగు మన వెలుగే ప్రకాశంపంతులుగారు. .

నిరాశాహృదయంతో నీళ్లు నమలడంకంటే యింకేమీ తోచలేదు. ఇంతలోనే ఆపైనుండి కనిపించీ కనిపించని వెలుగునుండి ఏదో సినిమాలో కనబడే వెలుగులా క్రిందికి దిగివచ్చింది. ఆ వెలుగును పంపినవారు గూడా పరిచయులే...విగ్రహం కదిలింది. నడవడానికి ప్రయత్నించింది...అడుగు సాగలేదు... మెదలింది......నోరువిప్పింది......పలకడానికి తొలిగా చేసిన ప్రయత్నం విఫలమైంది. ఆ వెనుక మాటలు తాతయ్యా బోసినోటికంటే అస్పష్టం . అసమగ్రం..

ప్రేక్షకుల్లో ఏదో కలకలం బయలుదేరింది. అది అలాగే విజృంభిస్తుందనుకున్నాను. కానీ ఇంతలోనే పొడుగుపాటి వ్యక్తి సిల్కులాల్చీలో చేతులిముడ్చుకుని వచ్చాడు. ఎఱ్ఱగా అందంగా వంగదేశపు పంచెకట్టుతో...వంగ సాహిత్యపు మెరుగుల ఉరవళ్లతో ఆయ నివ్వబోయే ఉపన్యాసం అత్యంతముఖ్యమైందని అందరూ ఆ వేపుకు చెవుల్ని నిక్కించారు...

ఆయనగారు ఆ శిల్పసౌందర్యాన్ని వర్ణించలేదు గానీ అది బాగానే వున్నదన్నారు... ఫరవాలేదన్నారు...

ఇంతలో ఇంకోవ్యక్తి ముందుకు తోసుకొచ్చి పాదాలులేకుంటే కాళ్లకే ఎక్కువకష్టం అంచేత పాదాలుండి తీరాలి అంటూ సెలవిచ్చారు...

ఇంతలో ఇంకోవ్యక్తి వాళ్లిద్దరికీ మధ్య వచ్చి కుడిచేయి విషయం మెల్లగా చూచుకోవచ్చునన్నారు.

ఆ వెనుకనుండి వచ్చిన వ్యక్తి శిఖ లేకుంటే మానె ప్రాణం వచ్చిందే పదివేలు. శిఖ పెరిగిందే పూలుగూడా వుంచకుండా మన్నారు.

ఈ విచిత్రమంతా చూచిన నా ఒళ్లంతా తేళ్లు, జెర్రులు ప్రాకినట్లయింది...సంపూర్ణ అవయవాలతో.. నిండు ప్రాణం లేకపోయినా అవ్యక్తంగా, అస్పష్టంగా కనిపించే శిల్పం కొనూపిరితో వుండినా బావుండే దనిపించింది. ఈ అసమగ్ర శిల్పం ఒద్దందామనుకున్నా... అహ్హో...ఈమా టనడం సామాన్యమా . నోరు పెగల్తుందా.. పెగిలినా ఆ మాటను ఆదరించేవా ళ్లుంటవద్దూ?

ప్రేక్షకుల్లో గలభా ఎక్కువవుతున్న కొద్దీ యవనిక దిగజారిపోయింది...నాటకం యింతటితో సమాప్తి ఐందనుకున్నాను..

ఓమారు తెరవేపు చూచాను. అదే నల్లటి ములికబట్ట దాచుకున్న మబ్బుతునకల్ని పేర్చుకుంటూవుంది. కానీ ఆమూల . చివర...సన్నటి అక్షరాలతో.. కనబడీ కనబడనట్టు "ఇంకా వుంది" అని వ్రాయబడింది. ఇంకా వుండేదేమో తెలుసుకోనే ఆతురత వున్నా ఎక్కువ ఉక్కపోయడంవల్ల హాలును ఒదిలెట్టాను. వెలుపల విద్యుల్లత వలయాలలో "అవతరించే తెలుగుతల్లి" అన్న పొడి అక్షరాలు కాంతి దీపాల జోడింపులతో మెరిసిపోతున్నాయి.

నాలు గడుగులు ముందుకు పెట్టానో లేదో ఎవరో అబ్బాయి పెద్ద నోటీసును అందిచ్చాడు. మరునాటికి గూడా ఇదే హాలులో ఉచితంగా ఇంకో కొత్తి నాటకాన్ని ప్రదర్శిస్తారేమో... ఈమారు నేను పొట్టి మనిషిని కాబట్టి నిక్కి చూచే అవసరంలేకుండా ముందు సీటునే ఆక్రమిద్దామని విప్పి చూచాను. కానీ నిరాశే యెదురయింది. నాటకం చూచాకనే దాని వివరాలను ప్రచురించి కరపత్రాలు పంచే అలవాటట ఆ కంపెనీది. అందులో గూడా నాటకం పేరు... "అవతరించే తెలుగుతల్లి" అని ప్రకటించబడింది. నటీమణు లెవరూ నాటకంలో కనబడకపోయినా కనీసం కరపత్రంలోనైనా కనబడుతారని ఆశపడ్డాను. వెదకి వెదకి చదివినా ఆరుమంది పేర్లు మాత్రం కనబడ్డాయి. ఇంగ్లీషుబాడీ వైపులో కనబడేవారు దాదాపు వందమంది వుంటారనుకొంటాను. వారిపేర్లు వ్రాయడం వ్రాసే నాకు, చదివే మీకు గూడా అట్టే ఉపయోగం వుండబోదని చాలుకున్నాను.

ఇక నా ఆలోచనకు మిగిలింది నేను చూచిన నాటకం ఎందుకు నవరసభావాలతో సమస్త ప్రజానీకాన్ని ఆకర్షించకపోయిందనిమాత్రమే.. అందుకు నాకు ఒకే సమాధానం తోచింది. ఆ నాటకంలో కథానాయిక లేకపోవడమే యిందుకు ప్రధానకారణమని తట్టింది...ఇంకా ఆ స్వప్నసీమలో నా మెదడులో ఏ ఆలోచన తట్టేదో కానీ మా అన్నయ్య వ్యాయామం చేయడానికి వుంచుకొన్న అలారం గడియారం ఒకటే మోత పెట్టింది.